

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
సోమవారం 18 మార్చి 2024

అకాల వర్షం.. అన్నదాతలకు నష్టం 8

వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారిస్తాం

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:25 సోమవారం
సహర్ 4:53 మంగళవారం



విజయీభవ

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- జిల్లాలో ఏర్పాట్లు పూర్తి
- 35 పరీక్ష కేంద్రాలు
- పలు కేంద్రాల్లో సీసీ కెమెరాలు
- కేంద్రాల వద్ద 144 సెక్షన్

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పదోతరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. సోమవారం నుంచి నిర్వహించనున్న పరీక్షలకు విద్యా ర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఉన్నత చదువులకు విద్యార్థికి పదోతరగతి తొలిమెట్టు. విద్యార్థులందరూ మెరుగైన ఫలితాలు సాధించే విధంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వార్షిక పరీక్షల కోసం ప్రత్యేక ప్రణాళికతో చదివించారు. 10 జీపీఏ సాధించే విధంగా ప్రత్యేక తరగతులు నిర్వహించారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పరీక్షలు ఒకేషనల్, సంస్కృతం కలిపి ఏప్రిల్ 2వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ప్రధాన పరీక్షలు మార్చి 30తో ముగియనున్నాయి. విద్యార్థులు విజయం సాధించాలనే తపనతో పరీక్షలకు సిద్ధమ య్యారు. జిల్లా కేంద్రంలో భద్రపరిచిన పరీక్ష పత్రాలను ఆయా మండలాల పోలీస్ స్టేషన్లకు తరలించారు.

● జిల్లాలో 6486 మంది విద్యార్థులు

జిల్లాలో పదోతరగతి పరీక్షలకు 6486 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వారిలో బాలురు 3087 మంది, బాలికలు 3399 మంది ఉన్నారు. రెగ్యులర్ విద్యార్థులు 6475 మంది ఉండగా, బాలురు 3080 మంది, బాలికలు 3395 మంది ఉన్నారు. ఇందులో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 102 మంది ఉండగా బాలురు 60 మంది, బాలికలు 42 మంది ఉన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2873 మంది విద్యార్థులకు బాలురు 1649 మంది, బాలికలు 1224 మంది, మోడల్ స్కూల్‌లో 663 మంది ఉండగా బాలురు 349 మంది, బాలికలు 314 మంది, తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలో 1103 మంది ఉండగా బాలురు 319 మంది, బాలికలు 784 మంది ఉన్నారు. కేజీబీవీలో 465 మంది బాలికలు చదువుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో 1269 మంది విద్యార్థులు ఉండగా బాలురు 698, బాలికలు 571 మంది ఉన్నారు. ఫెయిలైన విద్యార్థులు 11 మంది పరీక్షలు రాయనున్నారు.

● సీసీ కెమెరాల నిఘా

జిల్లాలో పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. గతంలో పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటు చేసినట్లుగానే సీసీ కెమెరాలను ఈ సారి కూడా కొనసాగిస్తున్నారు. పరీక్ష కేంద్రాల వద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 35 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష నిర్వహణకు 461 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. వీరిలో 372 మంది ఇన్విజిలేటర్లు, 35 చీఫ్ సూపరింటెండెంట్‌లు, 35 డిపార్ట్‌మెంట్ అధికారులు, ఐదుగురు సిట్టింగ్ స్క్వాడ్, ఆరుగురితో మరో రెండు ఫ్లయింగ్ బృందాలు, ఎనిమిది మంది రూట్ ఆఫీసర్లతోపాటు పరీక్ష కేంద్రాల వద్ద ఏఎన్‌ఎంలను అత్యవసర వైద్య సేవల కోసం నియమించారు. పరీక్ష కేంద్రాల వద్ద అన్ని మౌలిక సదుపాయాలు కల్పించారు.

● ఐదు నిమిషాల వరకు చాన్స్

విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్దకు ఒత్తిడికి గురవకుండా ఉండేందుకు సమయానికి ముందు వెళ్లడం మంచిది. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 నిమిషాల వరకు పరీక్ష రాసే వీలు కల్పించారు. ఫస్ట్ లాంగ్వేజ్ కంపోజిట్ కోర్సు సంబంధించి 20 నిమిషాలు అదనపు సమయాన్ని కేటాయించారు. సైన్స్ పరీక్షలు రెండు నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు జరగనుంది. పరీక్ష కేంద్రంలోకి అరగంట ముందు నుంచి పంపిస్తారు. 9.30 తరువాత ఐదు నిమిషాల వరకు విద్యార్థులకు పరీక్ష కేంద్రంలోకి వెళ్లడానికి అవకాశం కల్పించారు.

విద్యార్థులకు జాగ్రత్తలు

పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఇప్పటికే ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నారు.పరీక్షల సమయంలో విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలి.

- ఎట్టి పరిస్థితుల్లోనూ పాఠశాల యూనిఫాం వేసుకోకూడదు.
- ఓఎంఆర్ షీట్‌పై కోడ్ నంబరు మాత్రమే అదనపు జవాబు పత్రంపై వేయాలి.
- హాల్‌టికెట్ నంబరు వేయవద్దు
- సెల్ ఫోన్‌లు, కాలిక్యులేటర్‌లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించరు.
- పరీక్ష కేంద్రానికి కాగితాలు, జిరాక్స్ పేపర్‌లు తీసుకెళ్లొద్దు.
- ప్రైవేటు పరీక్ష కేంద్రాల్లో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందికి పరీక్ష సమయంలో లోపలికి అనుమతి ఉండదు.
- కేవలం పరీక్షకు ఐదు నిమిషాల ఆలస్యం మాత్రమే సడలింపు ఉంటుంది. 9.30కి పరీక్ష ప్రారంభం కానుంది. ఆ ప్రకారం 9.35 నిమిషాలకు మాత్రమే అనుమతి ఇస్తారు.
- పరీక్ష కేంద్రంలోకి వెళ్లిన తరువాత 15 నిమిషాలు బార్ కోడ్ షీట్, ఆన్సర్ షీట్, ఎలా నింపాలో ఇన్విజిలేటర్ ద్వారా తెలుసుకోవాలి.
- ఎలాంటి గుర్తింపు వివరాలకు ఆన్సర్ షీట్‌లపై రాయవద్దు
- ఏమైనా ఫిర్యాదులు ఉంటే డీఈవో దృష్టికి తీసుకెళ్లాలి.
- విద్యార్థులు ప్యాడ్, హాల్‌టికెట్, పెన్నులు, మర్చిపోవద్దు.

● టైం టేబుల్ ఇలా

18న మొదటి లాంగ్వేజ్ పరీక్ష, 19న రెండో లాంగ్వేజ్ పరీక్ష, 21న ఇంగ్లీష్, 23న మ్యాథ్స్, 26న సైన్స్ (ఫిజికల్‌సైన్స్) 28న సైన్స్ (బయోలాజికల్ సైన్స్, 30న సోషల్ స్టడీస్, ఏప్రిల్ 1న ఓఎస్‌ఎస్‌సీ మొదటి పరీక్ష లాంగ్వేజ్ సంస్కృతం, లేదా అరబిక్, ఒకేషనల్ కోర్సు థియరీ, 2వ తేదీన రెండో లాంగ్వేజ్ పరీక్ష నిర్వహించనున్నారు.

● హెల్ప్‌లైన్ ఏర్పాటు

పదోతరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో హైదరాబాద్‌లో 9441440849 హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పరీక్షలకు సంబంధించిన సందేహాలను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఫోన్ ద్వారా నివృత్తి చేసుకోవచ్చు.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి
- డీఈవో రమేష్‌కుమార్



పదోతరగతి విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో వార్షిక పరీక్షలు రాసే విధంగా ఏర్పాట్లు చేశాం. పరీక్ష సమయంలో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. పరీక్ష కేంద్రాలకు ఒక గంట ముందు చేరుకోవాలి. ఉదయం 9.35 గంటల తరువాత పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరు. పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులు, అధికారులు సెల్‌ఫోన్‌లు, స్మార్ట్‌వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లడం నిషేధం. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలి.

బోనమెత్తిన పద్మనగర్



బోనాలతో వెళ్తున్న మహిళలు

సిరిసిల్ల రూరల్, మార్చి 17: సిరిసిల్ల పట్టణంలోని పద్మనగర్‌లో పోచమ్మ, మైసమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. వార్డులో నూతనంగా నిర్మించిన పోచమ్మ, మైసమ్మ ఆలయాల్లో మూడు రోజుల క్రితం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలను చేపట్టారు. ఆదివారం ప్రతీ ఇంటి నుంచి మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకొని డప్పుచప్పుళ్ల మధ్య ఆలయాలకు చేరుకున్నారు. అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కుడిక్యాల రవికుమార్, మాజీ కౌన్సిలర్‌లు బింగి రాంబాబు, మ్యాన రవి, ఆలయ కమిటీ సభ్యులు మ్యాన వెంకటేశం, బండి మనోహర్, రాజేశం, శంకర్, ప్రకాష్, పెండెం సతీష్, శేఖర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రహీంఖాన్‌పేటలో..

ఇల్లంతకుంట: మండలంలోని రహీంఖాన్‌పేటలో పోచమ్మ బోనాలు ఆదివారం నిర్వహించారు. రేణుకాదేవి ఉత్సవాలలో భాగంగా డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య మహిళలు బోనాలు ఎత్తుకొని ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించారు. మూడు రోజులపాటు ఉత్సవాలు కొనసాగుతాయని గౌడ సంఘం నాయకులు పేర్కొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రజావాణి రద్దు

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 17: పార్లమెంట్ ఎన్నికల షెడ్యూలు విడుదలవడంతో ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణిని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు, సిబ్బంది, ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉంటారని పేర్కొన్నారు. ఎన్నికలు ముగిసేవరకు ప్రజావాణిని రద్దు చేస్తున్నామని ప్రజలు సహకరించాలని కోరారు.

ఆంజనేయస్వామి ఆలయంలో అఖండ భజన

ఎల్లారెడ్డిపేట, మార్చి 17: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో కరీంనగర్ పట్టణానికి చెందిన నీలకంఠ భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం అఖండ భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు గ్రామ పురవీధుల గుండా భక్తి పాటలతో నగర సంకీర్తన చేశారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అఖండ భజన కొనసాగింది. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అఫెరాసుల్తానా, మాజీ సర్పంచ్ లక్ష్మీ, మాజీ ఉప సర్పంచ్ మహేందర్, ఆలయ కమిటీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, నర్సయ్య, కిషన్‌రెడ్డి, కైలాసం భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణోత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న కేకే మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట, మార్చి 17:ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లికార్జునస్వామి కల్యాణ ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, స్థానిక నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని సంఘం సభ్యులు కేకే మహేందర్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కిష్టారెడ్డి, లక్ష్మణ్, సంఘం సభ్యులు లంబ ఎల్లయ్య, బుర్రవేణి ఎల్లయ్య పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్, ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి కోరారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఓటరు నమోదు చేసుకోవాలంటే ఎవరూ ఆందోళన చెందవద్దని, ఏప్రిల్ 15వ తేదీ వరకు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయనున్నట్లు చెప్పారు. మోడల్ కోడ్‌ను పాటించాలన్నారు. తుది ఓటరు జాబితాలో ఎవరిదైనా ఓటు హక్కు లేకపోతే బూత్ లెవల్ ఎలక్టోరల్ ఏజెంట్, రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశామని, సీ విజిల్, 1950 నంబరు, ఎన్‌జీఎస్‌పీకి వచ్చే ఫిర్యాదులపై సత్వరం స్పందించనున్నట్లు చెప్పారు. ఎవరైనా ఓటర్లను ప్రభావితం చేసే విధంగా చేస్తే సీ విజిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, వంద నిమిషాల్లో ఫిర్యాదును పరిశీలించి పరిష్కారం చూపిస్తామని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాలో ప్రకటనలు ఇచ్చే విషయంలో డీపీఆర్వో ఆధ్వర్యంలో ఏర్పాటైన ఎంసీఎంసీకి సమాచారం ఇవ్వాలన్నారు. దాని అనుమతితోనే పబ్లిష్ చేయించుకోవాలన్నారు. కరపత్రాలు, పోస్టర్లపై కచ్చితంగాముద్రించిన వారిపేరు ఫోన్ నంబరు ఉండాలని అన్నారు.

● సోషల్ మీడియాతో జాగ్రత్త

ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో రాజకీయ పార్టీల నాయకులు యువత సోషల్ మీడియా వినియోగం విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు చేయవద్దని, అనవసరపు మేసేజ్‌లతో ఇబ్బందులకు గురికావద్దని అన్నారు. యువత కేసులపాలై జీవితాలు నాశనం చేసుకోవద్దని, కేసులు నమోదైతే భవిష్యత్‌లో ఇబ్బంది అవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్‌లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రాజేశ్వర్, రమేష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా పెద్దమ్మ- పెద్దిరాజుల కల్యాణం

ఎల్లారెడ్డిపేట, మార్చి 17: ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామంలో ముదిరాజు సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ- పెద్దిరాజుల కల్యాణ ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం ఆలయంలో పురోహితులు కుంభవృష్టి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. పెద్దమ్మ- పెద్దిరాజుల కల్యాణ వేడుకలను కన్నుల పండువగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి తిలకించారు. నాగవెల్లి పట్నం, సిద్దులు తిరుగుట, గావు పట్టుట కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు ఒడి బియ్యం పోసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. చల్లంగా చూడాలని వేడుకున్నారు.

గత ప్రభుత్వంలో ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు దక్కని గౌరవం

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

సిరిసిల్ల టౌన్, మార్చి 17 : గత ప్రభుత్వంలో ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు గౌరవం దక్కలేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఆది వారం సిరిసిల్ల పట్టణ ఆర్‌ఎంపీ, పీఎంపీ భవనంలో సిరిసిల్ల పట్టణ ఆర్‌ఎంపీ, పీఎంపీల కమ్యూనిటీ పారామెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణాస్వీకారానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరోగ్యక రమైన ఏ చిన్న సమస్యలు వచ్చిన ముందుగా గుర్తుకొచ్చేది ఆర్‌ఎంపీలు, పీఎంపీలన్నారు. గత పభుత్వంలో రాష్ట్రంలోని ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు సరైన గుర్తింపు గౌరవం దక్కలేదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆర్‌ఎంపీ, పీఎంపీలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు, శిక్షణ పొందిన వారికి పారామెడికల్ సర్టిఫికెట్లను ఇచ్చి భవిష్యత్‌లో పోలీసుల నుంచి ఇబ్బంది లేకుండా చేసినట్లు చెప్పారు. వైఎస్ రాజశేర్‌రెడ్డి మరణాంతరం ఎవరూ పట్టించుకోక పోవడంతో కార్యక్రమాలు నిలిచిపోయాయన్నారు. ఆర్‌ఎంపీలు, పీఎంపీల సమస్యలను తప్పకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తాన న్నారు. కాంగ్రెస్ వచ్చింది కరువచ్చిందంటూ హరీష్‌రావు, కేటీఆర్ విమర్శలు చేస్తున్నారని, గత డిసెంబరు చలికాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే కరవు ఎలా వస్తుందని ప్రశ్నించారు. గత వర్షాకాలంలో ఏ ప్రభు త్వం అధికారంలో ఉందో ఆలోచన చేయాలన్నారు. వచ్చే వర్షకాలంలో వర్షాలు పడవద్దని ప్రజలు నష్టపోవాలని హరీష్‌రావు, కేటీఆర్ కోరుకుంటు న్నారన్నారు. గతేడాది అక్టోబర్‌లో మేడిగడ్డ కుంగిపోయింద న్నారు. అప్పుడు ఏ ప్రభుత్వం అధికారంలో ఉందో ఆలోచన చేయాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మేడిగడ్డ నుంచి 10 టీఎంసీల నీరును సముద్రంలోకి వదిలేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్‌ఎంపీ, పీఎంపీల అభివృద్ధితోపాటు కష్టాలను తీర్చే దిశగా తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు. అంతకుముందు పట్టణ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కుడికాల రవికుమార్, ప్రధాన కార్యదర్శి అలువాల ఈశ్వర్, కోశాధికారి జడల అశోక్, ఉపాధ్యక్షులు సిరిసిల్ల దేవదాస్, తిప్పవరం ప్రభాకర్, తౌటం శ్రీకాంత్, సహాయ కార్యదర్శి బక్కి వెంకటేష్, కార్యవర్గ సభ్యులు వెల్దండి మహేందర్, సకినాల మహేందర్, నెల్లుట్ల తిరుపతి, గొడిసెల చంద్రమౌళి, బింగి రామకృష్ణ, ఎథెక్స్ కమిటీ సభ్యులు మేర్గు సత్యనారాయణ, మంచికట్ల సుదర్శన్, మిట్టపెల్లి రాజమౌళి, మీస రాములు ముఖ్య అతిథుల సమక్షంలో ప్రమాణాస్వీకారం చేశారు. అనంతరం అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఆది శ్రీనివాస్, కేకే మహేందర్‌రెడ్డిని సన్మానించారు. కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వంగ మల్లేశంగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, వార్డు కౌన్సిలర్ గుండ్లపెల్లి రామానుజం, మాజీ కౌన్సిలర్లు చిలుక నారాయణ, యెల్లె లక్ష్మీనారాయణ, సిరిసిల్ల పట్టణ ఆర్‌ఎంపీ, పీఎంపీ కమ్యూనిటీ పారామెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి రవీందర్, జిల్లా అధ్యక్షుడు రాజమౌళి, సభ్యులు పాల్గొన్నారు.

వానొచ్చే.. వరదొచ్చే

- ఇళ్లు, దుకాణాల్లోకి చేరిన వరదనీరు
- కోతకు గురైన మట్టి రోడ్డు
- ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలు



రుద్రంగిలో కోతకు గురైన రోడ్డు

రుద్రంగి, మార్చి 17:రుద్రంగి మండల కేంద్రంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బస్టాండ్ నుంచి ఇందిరా చౌక్ వరకు ఉన్న ఇళ్లు, దకాణాల్లోకి వరద నీరు వచ్చి చేరింది. బస్టాండ్ వద్ద రాజేశ్వరి అనే మహిళ ఇంట్లోకి భారీగా వరద నీరు ప్రవేశించడంతో గృహోపకరణాలతో పాటు నిత్యావసర సరకులు, సర్టిఫికెట్‌లు తడిసి ముద్దయ్యాయాని ఆవేదన వ్యక్తం చేసింది. ఇందిరా చౌక్‌లోని ఓ బట్టల దుకాణంలో ఉన్న బట్టలు చాలా తడిసి ముద్దయ్యాయి. ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న అప్రోచ్ రోడ్లు పూర్తిగా కోతకు గురకావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు భారీ వర్షానికి ఒక పక్క ఒరిగి ప్రమాదకరంగా మారాయి. లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఎదుట, పోలీస్‌స్టేషన్ ఎదుట వరద ప్రవాహానికి మట్టి కోతకు గురై విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. కొద్ది నెలల క్రితం అంబేద్కర్ చౌరస్తా నుంచి సాయినగర్ కాలనీలో రెండు మీటర్ల వరకు రోడ్డు ఎత్తును పెంచి ఫోర్‌లైన్ రహదారి నిర్మించారు. నూతన రహదరి ఏర్పాటుతో రుద్రంగి మండల కేంద్ర వాసులకు ప్రమాదాలతో ఇబ్బందులు పడుతున్నారు. రహదారికి ఇరువైపుల డ్రెయినేజీలు నిర్మిస్తే వరద దుకాణాల్లోకి రాదని దుకాణదారులు పేర్కొంటున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిదులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించాలని, మురికి కాలువలు నిర్మాణం చేపట్టాలని, అప్రోచ్ రోడ్లను సమాంతరంగా చేయాలని, సీసీ రోడ్డు నిర్మించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



ఒరిగిన విద్యుత్ స్తంభం



ఇంట్లోకి చేరిన బురదను చూపిస్తున్న మహిళ

పరీక్ష సరిగా రాయలేదని యువతి ఆత్మహత్య

జగిత్యాల రూరల్, మార్చి 17: మండలంలోని అంతర్గాం గ్రామానికి చెందిన నాగులపల్లి అశ్విత (20) అనే యువతి బీటెక్ రెండో సంవత్సరం సెమిస్టర్ పరీక్ష సరిగా రాయలేదని మనస్తాపానికి గురై ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. జగిత్యాల రూరల్ ఎస్ఐ సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న అశ్విత ఇటీవల రెండో సెమిస్టర్ పరీక్షలకు హాజరైంది. అనంతరం శివరాత్రి సెలవుల కోసం అంతర్గాం గ్రామానికి వచ్చింది. పరీక్షలు సరిగా రాయలేదని పలు సందర్భాల్లో కుటుంబసభ్యుల వద్ద బాధపడింది. ఈ నేపథ్యంలో ఐదు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అశ్విత ఆదివారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వడగళ్ల వానకు నేలరాలిన మామిడి




గంభీరావుపేటలో రాలిని మామిడి కాయలు, దారిలో విరిగి పడిన చెట్టు

గంభీరావుపేట, మార్చి 17: గంభీరావుపేట మండలంలో కురిసిన వడగళ్ళ వానకు వరి పంటతో పాటు మామిడి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురు గాలులతో కూడిని వడగళ్ల వర్షంతో చేతుకు వచ్చిన వరి పంటలు దెబ్బతిన్నాయి. మరో 15 రోజుల్లో వరి కోతలు మొదలయ్యే పరిస్థితిలో ఊహించని నష్టం వాటిల్లడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈదురు గాలులకు మామిడి కాయలు రాలిపోయాయి. రహదారుల వెంట చెట్లు నెలకొరిగాయి.

● వరిపంటకు నష్టం..

కోనరావుపట: కోనరావుపేట మండలం మరిమడ్లలో శనవారం రాత్రి కురిసన వడగండ్ల వానతో వరిపంట దెబ్బతిన్నాయి. వరిపంటలు పొట్టకు వచ్చిన దశలో వడగండ్ల వాన వల్ల వరిపంటలు దెబ్బతినడం వల్ల రైతులు నష్టపోయో పరిస్థితి ఎర్పడింది. సుమారు మరిమడ్లలో పది ఎకరాల వరకు వరి పంటలు దెబ్బతిన్నయి.



మరిమడ్లలో నేలవాలిన వడ్లు

చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడి మృతి

కోరుట్ల రూరల్, మార్చి 17: మండలంలోని సంగెం గ్రామ శివారులోని వాగులో చేపలు పడుతుండగా యువకుడు మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివారులో వాగులో యువకులు చేపల వేట చేస్తుంటారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం సమయంలో గ్రామానికి చెందిన కొందరు యువకులు చేపల వేట కోసం వెళ్లారు. చేపలను విద్యుత్ షాక్ సహాయంతో పడుతుంటారు. ఈక్రమంలో పట్టుకున్న చేపలను తేవడానికి నీటిలోకి వెళ్లిన రాయుడి(35) విద్యుదాఘాదానికి గురై మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు రాయుడు బంధువులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో మునిగి మత్స్యకారుడు..

మెట్‌పల్లి, మార్చి, 17: పట్టణానికి చెందిన దీటి శంకర్(48) అను మత్స్యకారుడు ఆదివారం చెరువులో చేపలు పట్టుతుండగా ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని నీటిలో మునిగి మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. పోలీసలు, కుటుంబ సభ్యులు తెలిపిన వివారల ప్రకారం.. పట్టణానికి చెందిన శంకర్ చేపలను పట్టుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆదివారం మెట్‌పల్లి అనుబంధ గ్రామమైన రేగుంట గ్రామ శివారులోని చెరువులో చేపలు పట్టడానికి తోటి మత్స్యకారులతో కలిసి వెళ్లాడు. ఈ క్రమంలో చేపలు పట్టడానికి వేసిన వల కాలుకు చుట్టుకొని చెరువులో మునిగిపోయాడు. గమనించిన తోటి మత్స్యకారులు శంకర్‌ను బయటకు తీసేసరికి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో గాయపడిన వృద్ధురాలి మృతి

మెట్‌పల్లి, మార్చి 17: మెట్‌పల్లి అనుబంధ గ్రామమైన ఆరుపేట గ్రామ బస్టాండ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధినేని భూమక్క(60) అనే వృద్ధురాలు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. ఆరపేటకు చెందిన బాధినేతి భూమక్క, కోరుట్ల మండలం మోహన్‌రావుపేట గ్రామానికి చెందిన నల్ల లక్ష్మి, శనిగారపు తుక్కవ్వ ఆరపేట బస్టాండ్ బస్సు దిగారు. ముగ్గురు మహిళలు ఇంటికి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా ఏపీ01ఎస్4455 నంబర్ గల కారులో భీమవరం మండలం రాగోజీపేటకు చెందిన సురేష్ అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో ముగ్గురు మహిళలు తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను స్థానికులు ప్రత్యేక వాహనంలో మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్న బాధినేని భూమక్క ఆదివారం ఉదయం మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయే..

- ధర్మపురిలో 20 నుంచి
ఏప్రిల్ 1 వరకు నిర్వహణ



విద్యుత్ దీపాల అలంకరణలో ఆలయం, క్షేత్రంలోని లక్ష్మీనృసింహ (యోగ) స్వామి వారు

ధర్మపురి, మార్చి 17: ధర్మపురిలో మార్చి 20 నుంచి ఏప్రిల్ 1 వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పవిత్ర గోదావరి నదీ తీరాన విరాజిల్లుతున్న ధర్మపురి క్షేత్రానికి పురాణ, ఇతిహాస, సాహిత్యపర ప్రాధాన్యం కలిగి ఆధ్యాత్మిక క్షేత్రంగా విలసిల్లుతోంది. పూర్వం ధర్మవర్మ అనే మహారాజు పరిపాలించుట వలన ఈ క్షేత్రానికి ధర్మపురి అనే పేరు వచ్చింది. క్షేత్రంలో ప్రధానంగా లక్ష్మీనృసింహ స్వామి, రామలింగేశ్వరస్వామి ఆలయాలు, మసీదులు పక్కపక్కనే కలిగి అనాది నుంచి వైష్ణవ, శైవ, ముస్లిం మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. ఈ క్షేత్రంలో బ్రహ్మదేవుడు, విష్ణుస్వరూపుడు అయిన నరసింహస్వామి, రామలింగేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు ముగ్గురు కొలువు అయిన ఈ క్షేత్రాన్ని త్రిమూర్తి క్షేత్రమని కూడా పిలుస్తారు. ఈ ఆలయ ప్రాంగణంలో యమధర్మ రాజు ఆలయం ఉంది. గోదావరి నదిలో స్నానం చేసిన అనతరం స్వామివారలను దర్శనం చేసుకోవటం ఇక్కడ ఆనవాయితీ. స్వామి వారలను దర్శించుకుంటే మానసిక, శారీరక, రుణ బాధలు తొలగి, ఆయురారోగ్య, అష్టఐశ్వర్యాలు ప్రసాదించుతారని భక్తులకు అపార నమ్మకం ఉంది. మార్చి 20 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగే లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి భక్తులు చేరుకుని స్వామివారలను దర్శనం చేసుకుంటారు.

● బ్రహ్మోత్సవాల్లో కార్యక్రమాలు..

ధర్మపురి క్షేత్రంలో మార్చి 20 నుంచి ఏప్రిల్ 1 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ ఈవో, సహాయ కమిషనర్ సంకటాల శ్రీనివాస్ తెలిపారు. మార్చి 20న బుధవారం ఏకాదశి రోజున యజ్ఞాచార్యుల ఆహ్వానం, కళశ, విశ్వక్‌సేన, వాసుదేవ, పుణ్యాహవచనం, బ్రహ్మ కలశ స్థాపన, అంకురార్పణ, వరహాతీర్థం, పుట్ట బంగారం తేవడం, 21న సాయంత్రం ఆరు గంటలకు స్వామివారల కల్యాణం, 22న రాత్రి లక్ష్మీనరసింహ స్వామి వారల ఊరేగింపు సేవ ఉంటుంది. మార్చి 23న రాత్రి వేంకటేశ్వర స్వామి వారల ఊరేగింపు సేవ, 24న బ్రహ్మ పుష్కరిణిలో యోగ నృసింహస్వామి తెప్పె, డోలోత్సవాలు, 25న బ్రహ్మ పుష్కరిణిలో ఉగ్ర లక్ష్మీ నృసింహ స్వామి తెప్పె, డోలోత్సవాలు ఉంటాయి. 26న బ్రహ్మపుష్కరిణిలో వేంకటేశ్వరస్వామి తెప్పె, డోలోత్సవాలు, సాయంత్ర లక్ష్మీనృసింహస్వామి దక్షిణ దిగ్యాత్ర ఉంటుంది. మార్చి 27న లక్ష్మీ నృసింహ స్వామి ఉత్తర దిగ్యాత్ర, రాత్రి ఎనిమిది గంటలకు భోగ మండప ఉత్సవం, తొమ్మిది గంటలకు వేద సదస్సు ఉంటుంది. మార్చి 28న వేంకటేశ్వర స్వామి, దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలు, రాత్రి ఎనిమిది గంటలకు దీపోత్సవం, 29న పూర్ణాహుతి, రథోత్సవం, చక్రతీర్థం, రాత్రి తొమ్మిది గంటలకు లక్ష్మీనృసింహ స్వామి వారల పుష్పయాగం ఉంటుంది. 30న రాత్రి ఏడు గంటలకు వేంకటేశ్వర స్వామి పుష్పయాగం, రాత్రి తొమ్మిది గంటలకు యోగ లక్ష్మీనర్సింహస్వామి ఏకాంతోత్సం, 31న రాత్రి ఏడు గంటలకు కొత్త నరసింహస్వామి పుష్పయాగం, రాత్రి తొమ్మిది గంటలకు వేంకటేశ్వరస్వామి ఏకాంతోత్సవం, ఏప్రిల్ 1న రాత్రి తొమ్మిది గంటలకు కొత్త నారసింహ స్వామి ఏకాంతోత్సవాలు ఉంటాయి.

● ఆలయ పక్షాన ఏర్పాట్లు పూర్తి
- ఆలయ ఈవో శ్రీనివాస్



స్వామివారి బ్రహ్మోత్సవాల కోసం ఆలయం పక్షాన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాము. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో క్యూలైన్లు, చలువ పందిళ్లు, మంచి నీటి సౌకర్యం ఏర్పాటు చేశాము. ఆలయాలు, గోపురాలకు సున్నం, రంగులు వేయించి విద్యుత్ దీపాలతో అలంకరించాము. గోదావరి నది, స్నానఘట్టాల వద్ద పందిళ్లు, దుస్తుల మార్పిడి కోసం తాత్కాలిక గదులు ఏర్పాటు చేయించాము.

గల్ఫ్ పంపిస్తానని ఏజెంట్ మోసం

- న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 17: గల్ఫ్ ఏజెంట్ మోసం చేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. తమను మోసం చేసిన ఏజెంటుపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని ఆదివారం విలేకరులను వేడుకున్నారు. బాధితుల కథనం మేరకు.. మండలంలోని సింగారం, బండలింగంపల్లి, గొల్లపల్లి గ్రామాలకు చెందిన యువకులు రషీద్, ముఫీద్, ఆసీఫ్, ఇర్ఫాన్, సయ్యద్ ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో నాలుగు నెలల కిందట ముంబాయిలోని ఏజెంట్ అక్తర్ పరిచయమయ్యాడు. రూ1.50 లక్షలు చెల్లించాలని పేర్కొన్నాడు. ముందుగా రూ.ఒక్కొక్కరు రూ.80 వేలు ముట్టజెప్పాలని స్పష్టం చేశాడు. దీంతో ఐదుగురు యువకులు అప్పులు చేసి రూ.4లక్షలు అప్పజెప్పారు. పాస్‌పోర్టులు, డబ్బులు తీసుకున్నాడు. రెండు నెలలు గడుస్తున్నా వీసా పంపించకపోవడంతో సెల్‌ఫోనులో సంప్రదించారు. ఏజెంటు స్పందించకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. 15 రోజుల కిందట సదరు ఏజెంటు యువకుల పాసుపోర్టులను కొరియర్ ద్వారా పంపడంతో తాము మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బుల విషయంపై అడిగేందుకు సెల్‌ఫోనులో సంప్రదిస్తే స్పందన లేదని వాపోయారు. ముంబాయికి వెళ్లలేక.. ఏం చేయాలో తెలియక యువకులు ఆందోళన చెందుతున్నారు. ఏజెంట్ అక్తర్‌పై పోలీసులు చర్యలు తీసుకోవాలని, న్యాయం చేయాలని బాధిత యువకులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాద మృతుడి గుర్తింపు


నారాయణ(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మార్చి 17: ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులో ఈ నెల 16న రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందిన మతిస్థిమితం లేని వ్యక్తి ఎల్లారెడ్డిపేట వాసి మంద నారాయణ(53)గా ఆదివారం పోలీసులు, కుటుంబ సభ్యులు గుర్తించారు. వారి కథనం మేరకు.. గ్రామంలోని నారాయణ గత కొంత కాలంగా మతిస్థిమితం లేకుండా ఇంటి వద్దనే కుటుంబ సభ్యులతో కలిసి జీవిస్తుండేవాడు. ఈ నెల 16న ఇంటిలో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల గాలించారు. తిమ్మాపూర్ గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గుర్తు తెలియని శవం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రిలో ఉందనే సమాచారంతో అక్కడకు వెళ్లి చూడగా తమ తండ్రి నారాయణ అని గుర్తించారు. తమ తండ్రి మరణానికి కారణమైన వాహనాన్ని గుర్తించి చర్యలు తీసుకోవాలని మృతుడి కొడుకు శ్రీకాంత్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు. మృతుడికి భార్య చంద్రకళ, కూతురు స్వప్న, ఇద్దరు కొడుకు శ్రీకాంత్, ప్రశాంత్‌లు ఉన్నారు. కాగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు, కోడెమొక్కులు చెల్లించుకుంటున్న జడ్జి శ్రీలేఖ

వేములవాడ టౌన్, మార్చి 17 : దక్షిణకాశీ వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు రాజన్న ఆలయానికి తరలివచ్చారు. స్వామి వారి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించి రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. రాజన్నను దర్శించుకున్న అనంతరం అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలేత్తకుండా ఉండేందుకు ఆలయాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● రాజన్న సేవలు ప్రముఖులు..

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని తెలంగాణ రాష్ట్ర వికలాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సంచాలకులు బొడ్డ శైలజ దర్శించుకున్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించగా సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. సిరిసిల్ల జిల్లా అసిస్టెంట్ సెషన్‌జడ్జి శ్రీలేఖ ఆలయంలో ప్రత్యేకపూజలో పాల్గొని కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సూపరింటెండెంట్ తిరుపతిరావు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

భూ కబ్జా కేసులో మాజీ ఉపసర్పంచ్ అరెస్ట్

సిరిసిల్ల క్రైం, మార్చి 17: భూ కబ్జాకు పాల్పడిన కేసులో తంగళ్లపల్లి మండలకేంద్రం మాజీ ఉపసర్పంచ్ పెద్దూరు తిరుపతిని ఆదివారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పద్మనగర్‌లోని వేముల కనక నారాయణ, రాజ్యలక్ష్మి, గాజుల లతకు చెందిన సర్వేనెంబర్ 247లోని భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని వారి భూమిని తిరిగి రిజిస్ట్రేషన్ చేయడానికి తిరుపతి భారీగా డబ్బులు డిమాండ్ చేశారని ఆయన తెలిపారు. ఈ మేరకు బాధితులు ఫిర్యాదుచేయగా తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో తిరుపతిపై కేసు నమోదు చేసి ధర్యాప్తు చేయగా అనేక క్రిమినల్, అక్రమ డబ్బు వసూళ్లకు పాల్పడిన కేసుల్లో నిందితుడని తేలిందన్నారు. దీంతో తిరుపతిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపామని ఆయన తెలిపారు. భూ కబ్జాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ డబ్బులు డిమాండ్‌చేసే వారిపై ప్రజలు ధైర్యంగా పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలని ఆయన తెలిపారు.

తంగళ్లపల్లి ఎంపీటీసీ అంతయ్య..

భూ అక్రమణ కేసులో జిల్లాలోని తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కోడి అంతయ్యను ఆదివారం అరెస్ట్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తంగళ్లపల్లి మండలంలో మహిళ పేరుతో ఉన్న భూమిని ధరణి సమయంలో తంగళ్లపల్లి ఎంపీటీసీ కోడి అంతయ్య తన పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నాడన్నారు. భూమిని ఖాళీ చేయాలని భూమిలోకి అక్రమంగా ప్రవేశించి కులం పేరుతో దూషించాడని బాధితురాలు గట్టుపల్లి భూమవ్వ తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఆయన తెలిపారు. ఫిర్యాదు మేరకు అంతయ్యపై బెదిరింపులు, భూ ఆక్రమణ, అట్రాసిటీ కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

● ఆగి ఉన్న లారీ ఢీకొని ముగ్గురు..
● ఆటో ఢీకొని ఒకరి దుర్మరణం


వేణుగోపాల్(ఫైల్)

శ్రీకాంత్ (ఫైల్)

కోరుట్ల రూరల్, మార్చి 17: జగిత్యాల, కరీంనగర్ జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. కోరుట్ల మండలం వెంకటాపూర్ గ్రామంలో ఆదివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కూలీలు మృతి చెందారు. కోరుట్ల మండలం వెంటాపూర్ గ్రామ శివారులోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కూలీలు మృతి చెందారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఒంగోలు పట్టణానికి చెందిన బడికెల వేణుగోపాల్ (30) మల్యాల మండల ముత్యంపేట గ్రామానికి తన తండ్రితో 25 సంవత్సర క్రితం వచ్చి నివాసం ఉంటున్నాడు. వేణుగోపాల వృతిరిత్యా మేస్త్రీ పనిచేస్తూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో కొండగట్టు ప్రాంతంలో ఓ వ్యాపారి మెట్‌పల్లి పట్టణంలో తన కూతురు ఇల్లు నిర్మాణం పనులను వేణుగోపాల్‌కు అప్పగించాడు. నిర్మాణ పనులలో భాగంగా వేణుగోపాల్ ఆదివారం ఉదయం కొండగట్టు ప్రాంతానికి చెందిన పసులేటి శ్రీకాంత్ (23), కొమరం వెంకటేష్ (40) అనే కూలీలతో మెట్‌పల్లి పట్టణంలో ఇంటి పనులు చేసేందుకు ఒకే ద్విచక్రవాహనంపై బయల్దేరారు. ఈక్రమంలో మండలంలోని వెంకటాపూర్ గ్రామశివారులో జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. ఈ సంఘటనలో పసులేటి శ్రీకాంత్, కొమరం వెంకటేష్ సంఘటన స్థలంలోనే మృతి చెందగా బడికెల వేణుగోపాల్ తీవ్ర గాయాలతో పడిపోయి ఉన్నాడు. గమనించి స్థానికులు విషయాన్ని కోరుట్ల పోలీసులతో పాటు 108 సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది వేణుగోపాల్‌ను చికిత్సనిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కోరుట్ల, మెడిపల్లి ఎస్ఐలు కిరణ్ కుమార్, శ్యాంప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. మృతదేహాలను కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. పసులేటి శ్రీకాంత్‌కు ఇటీవల వివాహం జరుగగా భార్య శిరిషా గర్భవతిగా ఉంది. వేణుగోపాల్‌కు భార్య జ్యోతితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకటేష్‌కు భార్య సాయమ్మ తో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాదానికి గురైన వాహనాన్ని రాజస్థాన్‌కు చెందిన వాహనంగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. సంఘటన స్థలాన్ని కోరుట్ల సీఐ సురేష్‌బాబు పరిశీలించారు.

● ముత్యంపేటలో విషాదం..

మల్యాల: కోరుట్ల మండలం వెంకటాపూర్ వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముత్యంపేట, కొండగట్టుకు చెందిన ముగ్గురు దుర్మరణం చెందడం స్థానికంగా విషాదం నింపింది. ఒంగోలు ప్రాంతానికి చెందిన వేణు ఇళ్ల నిర్మాణ పనులకు గాను కొన్నేళ్ల క్రితం ముత్యంపేటకు వచ్చాడు. ఇళ్ల నిర్మాణాలు చేస్తున్న అతను మెట్‌పల్లిలో జరిగే పనుల కోసం కొండగట్టుకు చెందిన శ్రీకాంత్, వెంకటేష్‌ను తీసుకెళుతుండగా జరిగిన ఈ ఘటనలో ముగ్గురూ మృతి చెందగా వేణు మృతదేహాన్ని తమ స్వగ్రామం ఒంగోలుకు తరలించారు. వేణుకు భార్య, ఐదేళ్లలోపు ఇద్దరు కొడుకులు ఉన్నారు. శ్రీకాంత్ మృతదేహానికి కుటుంబసభ్యులు కొండగట్టులో అంత్యక్రియలు నిర్వహించారు.

● కరీంనగర్ జిల్లాలో..

కరీంనగర్ క్రైం: కొత్తపల్లి మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొక్కెరకుంటకు చెందిన బత్తిని లక్ష్మిరాజం(60) తీవ్రగాయాలతో ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

లక్ష్మిరాజం ఉదయం పనిఉందని కొత్తపల్లికి వెళ్ళిన సమయంలో రోడ్డు పక్కన నడుస్తుండగా వెనుకవైపు నుంచి అతివేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టి కొంతదూరం వరకు లాక్కెల్లిన ఆటో బోల్తాపడిందని తెలిపారు. దీంతో లక్ష్మీరాజంతోపాటు ఆటోలో ఉన్న నలుగురు వ్యక్తులకు గాయాలుకాగా అందరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో లక్ష్మీరాజం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన ఆటోడ్రైవర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

వేర్వేరు చోట్ల పిడుగుపాటుకు మూడు గేదెల మృతి


వల్బాపూర్‌లో మృతి చెందిన గేదె

వీణవంక, మార్చి 17: మండలంలోని వల్బాపూర్ గ్రామంలో అదివారం సాయత్రం పిడుగు పడడంతో గేదే మృతి చెందింది. గ్రామంలోని తాళ్ళపల్లి శ్రీనివాస్‌కు చెందిన గేదేను ఇంటి ఆవరణలో చెట్టు కింద మేత మేస్తుండగా పిడుగు పాటుతో మృతి చెందినట్లు తెలిపారు. దాదపు యాభై వేల విలువచేసే గేదే మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు.

గన్నేరువరం: మండలంలో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పిడుగుపడి మండల కేంద్రానికి చెందిన రైతు బుర్ర రామచంద్రం పాడి గేదె మృతి చెందింది. గేదె మృతితో సుమారు రూ.60 వేల నష్టవ వాటిల్లిందని, దీంతో జీవనోపాధి కోల్పోయానని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

కాల్వ శ్రీరాంపూర్: పిడుగుపాటుతో పాడి గేదె మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పెరుగు ఐలు కొమురయ్యకు చెందిన పాడి గేదెను ఇంటి సమీపంలోని ఓ చెట్టు కట్టేశాడు. అకాల వర్షంతోపాటు చెట్టుపై పిడుగుపడి గేదె అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. గేదె విలువ రూ.40వేలు ఉంటుందని బాధితులు వాపోయాడు.

మల్లారెడ్డిపేటలో ఒకరి ఆత్మహత్య

గంభీరావుపేట, మార్చి 17: గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన కండెల దేవయ్య (46) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. కండెల దేవయ్య శనివారం తన ఇంట్లో గడ్డిమందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున దేవయ్య మృతి చెందాడు. సిద్దిపేటలో ఉన్న ప్లాటు రోడ్డు విస్తరణలో పోతుందనే బెంగతో దేవయ్య రోజూ బాధపడేవాడని మృతుడి భార్య మల్లవ్వ పోలీస్‌లకు ఇచ్చిన పిర్యాదులో పేర్కొంది. అయితే ప్లాటు కొనుగోలు సమయంలో చేసిన అప్పుతో పాటు పిల్లల చదువుల కోసం చేసిన అప్పులతో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపింది. ప్లాటు కోసం చేసిన అప్పే కట్టని పరిస్తితిలో ఆ ప్లాటే రోడ్డు విస్తరణలో పోతుందనడంతో మానసికంగా కృంగిపోయాడని వెల్లడించింది. అప్పుల ఒత్తిళ్లు, మరో వైపు ప్లాటు బెంగతో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని దేవయ్య భార్య ఫిర్యాదు చేసింది. మృతుడి భార్య పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాంమోహన్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి మృతి



హరీష్ (ఫైల్)

ఇల్లందకుంట, మార్చి 17: మండల కేంద్రంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి కంచం హరీష్ (28) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన నలుగురు ట్రాక్టర్ (మిల్లర్)పై జమ్మికుంటలో ఒకరి ఇంటికి స్లాబ్ పోసి ఆదివారం సాయంత్రం తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో ఇల్లందకుంట ఎస్‌బీఐ సమీపంలో రోడ్డుపై కంకర కుప్ప ఉండడంతో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కంకర కుప్ప ఎక్కడం వల్ల ఇంజన్ బోల్తా పడింది. దీంతో ఇంజన్‌పై కుర్చున్న కంచం హరీష్ ఎగిరిపడి కింద పడడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అరుణ్, సాంబయ్యకు తీవ్రగాయాలు కాగా, రాజయ్యకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. గాయాలైన వారిని జమ్మికుంట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతి చెందిన హరీష్‌కు 9నెలల క్రితమే వివాహం జరిగింది. వీరందరూ ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో కనగర్తి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

పెద్దపల్లి రూరల్ మార్చి 17: మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన పొన్నం శ్రీనివాస్‌గౌడ్ అనే గీత కార్మికుడు తాటి చెట్టు పైనుంచి పడి గాయాల పాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వృత్తిరీత్యా శనివారం సాయంత్రం కల్లు గీసేందుకు వెళ్లగా తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తున్న క్రమంలో మోకు జారి శ్రీనివాస్ కింద పడిపోయాడు. వెంటనే స్థానికులు గుర్తించి పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కుటుంబసభ్యులు, గౌడ సంఘం నేతలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మాజీ తహసీల్దార్ ఇంట్లో సోదాలు


శ్రీనివాస్ ఇంట్లో సోదాలు చేస్తున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, మార్చి 17: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి భూమిని ఆక్రమించిన కేసులో అరెస్టు అయి జైలులో ఉన్న మాజీ తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌ను కస్టడీకి తీసుకున్న కరీంనగర్ రూరల్ పోలీసులు హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో అతని ఇంటిలో ఆదివారం సోదాలు నిర్వహించారు. రెండురోజులు కస్టడీకి తీసుకున్న పోలీసులు మొదటి రోజు శనివారం కరీంనగర్‌లో ఇల్లు, గెస్ట్‌హౌజ్‌లో సోదాలు జరిపిన పోలీసులు పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం మాదాపూర్‌కు తీసుకువెళ్లి అతని అపార్ట్‌మెంట్‌లో సోదాలు నిర్వహించామని, కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

పెగడపల్లి, మార్చి 17: మండలం లోని బతికెపల్లి గ్రామానికి చెందిన వడ్కాపురం భాస్కర్ (35) అనే యువకుడు జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు భాస్కర్ అప్పుల బాధ పెరగడంతో కుటుంబ పోషణ భారం అయింది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇంటి పక్కనచ గల బాత్రూంలో ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుని భార్య మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఇల్లంతకుంట, మార్చి 17: మండలంలో పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో బన్నాజీ తెలిపారు. పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానుండగా మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో 108 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 180 మంది. గాలిపెల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 106 మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు సరైన సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని సూచించారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈవో రఘుపతి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పరీక్షా కేంద్రాలను కేటాయించామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 230, విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 240 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. సీఎస్‌గా మనోహరాచారి, రమేష్‌తోపాటు మొత్తం 45 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించనున్నారని పేర్కొన్నారు. కేంద్రాలలో అన్ని వసతులు కల్పించామని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ఎంఈవో సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద భద్రత ఏర్పాటు చర్యలు చేపట్టనున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

రోడ్డుపై పడిన చెట్టు.. రాకపోకలకు ఇబ్బందులు


చెట్టును తొలగిస్తున్న ఎస్సై, స్థానికులు

తంగళ్లపల్లి, మార్చి 17: అకాల వర్షానికి తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి గ్రామ శివారులో ప్రధాన రహదారిపై చెట్టు పడిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. అకాల వర్షం, ఈదురుగాలులతో ఆదివారం తెల్లవారుజామున రోడ్డుపై చెట్టు పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ సుధాకర్ తక్షణమే సిబ్బందితో అక్కడికి చేరుకొని కొందరు స్థానికుల సహాయంతో రోడ్డుపై పడిపోయిన చెట్టును తొలగించారు. రోడ్డుపై ట్రాఫిక్ క్లియర్ చేశారు.

పిల్లలను ఫోన్లకు దూరంగా ఉంచాలి


ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

సిరిసిల్ల రూరల్, మార్చి 17: చిన్నతనంలోనే పిల్లలు ఫోన్లకు అలవాటు పడి కళ్లతో పాటు చదువును దూరం చేసుకుంటున్నారని, తల్లిదండ్రులు పిల్లలను ఫోన్లకు దూరంగా ఉంచాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి కోరారు. సిరిసిల్ల పట్టణంలోని చైతన్యభారతి స్కూల్ రెండో వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్య క్రమా న్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, కౌన్సిలర్ గూడూరి భాస్కర్, అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు సన్మానం


సన్మానిస్తున్న లబ్ధిదారులు

ఇల్లంతకుంట, మార్చి 17: మండలంలోని పెద్దలింగాపూర్‌లో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు ఆదివారం మాజీ సర్పంచ్ గొడిశెల జితేందర్ గౌడ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద వసతులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గతంలోనే గ్రామసభల ద్వారా అర్హులైన వారిని ఎంపిక చేశామన్నారు. మాజీ సర్పంచ్ రూ.5లక్షల సొంత ఖర్చులతో వాటర్ ట్యాంకు, నలాలు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వసుల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రజక సంఘాల రాష్ట్ర సమన్వయక కమిటీ ఉపాధ్యక్షుడిగా అంజయ్య


నియామక పత్రాన్ని అందుకుంటున్న అంజయ్య

ఇల్లంతకుంట, మార్చి 17: రజక సంఘాల రాష్ట్ర సమన్వయ కమిటీ ఉపాధ్యక్షుడిగా అంతగిరి అంజయ్యను నియమిస్తున్నట్లు రాష్ట్ర కమిటీ చైర్మన్ బస్వరాజు సారయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండలకేంద్రానికి చెందిన అంజయ్య గతంలో పలు పదవులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు తెలంగాణ శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

సిరిసిల్ల టౌన్ మార్చి 17: అధికార పార్టీ కాంగ్రెస్‌లో బీఆర్ఎస్, బీజేపీ నాయకుల చేరికలు కొనసాగుతున్నాయి. ఆదివారం సిరిసిల్ల పట్టణం 12వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు రొడ్ల శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ నాయకులు సుంకోజు రాజు, రొడ్ల గోపాల్ రెడ్డి, సూర దేవరాజు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆధ్వర్యంలో సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కు సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలు వంటి పథకాలను వంద రోజుల్లో అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలందరూ అభివృద్ధి చెందుతారన్నారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు చూసి చేరికలు పెరుగుతున్నాయన్నారు. సిరిసిల్లలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ వార్డు అధ్యక్షుడు నూనె శ్రీనివాస్, నాయకులు కత్తెరపాక ఎల్లయ్య తడక వెంకటేశం, మ్యాన సత్యనారాయణ పాల్గొన్నారు.

22న ముత్యాల పోచమ్మ ఆలయ హుండీ లెక్కింపు

ఇల్లంతకుంట, మార్చి 17: మండలంలోని అనంతగిరి గ్రామంలోని ముత్యాల పోచమ్మతల్లి ఆలయ హుండీని ఈనెల 22న లెక్కించనున్నట్లు కార్యనిర్వాహణాధికారి మారుతిరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ అవరణలో ఉదయం 10 గంటలకు లెక్కింపు ఉన్నదని, ఆసక్తికలిగిన వారు హుండీ లెక్కింపులో పాల్గొనాలని కోరారు.

ఎల్లమ్మ గుడిలో చోరీ

సిరిసిల్ల క్రైం, మార్చి 17: సిరిసిల్ల పట్టణంలోని పెద్దూరు శివారులోని పెద్దమ్మ ఆలయంలో శనివారం అర్ధరాత్రి తర్వాత చోరీ జరిగింది. పెద్దమ్మ ఆలయంలోకి ప్రవేశించిన దొంగలు హుండీని పగులగొట్టి అందులో ఉన్న నగదును ఎత్తుకెళ్లారు. ఇంతటితో ఆగకుండా అమ్మవారి బంగారు బొట్టుబిల్ల, వెండి నగను తీసుకెళ్లారు. ఈ సంఘటనపై ఆలయ నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి దొంగల కోసం అన్వేషణ మొదలు పెట్టారు. సీసీ ఫుటేజీల ఆధారంగా దొంగలు ఎటువైపు వెళ్లారనేది పోలీసులు పరిశీలిస్తున్నారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో ఓ మొబైల్ షాప్‌లో యజమానిని నమ్మించి ఆపిల్ కంపెనీ ఫోన్‌ను ఎత్తుకెళ్లారు.

ఇందిరమ్మ కాలనీలో ఉచిత వైద్య శిబిరం

తంగళ్లపల్లి, మార్చి 17: తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గడ్డం మధుకర్ ఆధ్వర్యంలో కరీంనగర్‌కు చెందిన ఐర అఖిర హాస్పిటల్, గ్యాస్ట్రో లివర్ మల్టిస్పెషల్ ఆసుపత్రి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేశారు.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

వేములవాడ రూరల్, మార్చి 17: తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం ఎదురుగట్ల గ్రామానికి చెందిన పొన్నం పర్శరాం (55) ఆదివారం ఉదయం తాటి చెట్టు ఎక్కి, కల్లు గీసే క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య దేవేంద్ర, నలుగురు కూతుళ్లు ఉన్నారు.

అకాల వర్షం.. అన్నదాతలకు నష్టం

- వడగళ్ల వానతో నేలకొరిగిన వరి
- పరిశీలించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు


వన్‌పల్లిలో పంటను పరిశీలిస్తున్న అధికారులు

వీర్నపల్లి, మార్చి 17: అకాల వర్షానికి అన్నదాతలకు అపార నష్టం వాటిల్లింది. వీర్నపల్లి మండలం అడవిపదిర, లాల్‌సింగ్‌తండా, వన్‌పల్లి గ్రామాల్లో శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షానికి వరిపంటలు దెబ్బతిన్నాయి. చేతికి వచ్చి పొట్ట దశలో ఉన్న వరిపంట నేలకొరిగింది. సుమారు వంద ఎకరాల వరకు నష్టం వాటిల్లిందని మండల వ్యవసాయ అధికారి భూంరెడ్డి, నాయబ్ తహసీల్దార్ ఎల్లాని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం పలు గ్రామాల్లో వానకు నష్టపోయిన వరిపంటలను మండల అధికారులతో కలిసి పరిశీలించారు. సోమవారం పూర్తిస్థాయిలో పంటనష్టాన్ని అంచనా వేస్తామన్నారు. నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందిస్తామన్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, ఏఈవో శ్రీధర్, మాజీ సర్పంచ్‌లు మల్లేశం తదితరులు ఉన్నారు.

● వీర్నపల్లి మండలంలోని పలు గ్రామాల్లో వడగళ్ల వానకు పంట నష్టపోయిన రైతులు అధైర్య పడొద్దని ప్రభుత్వం తరుపున ఆదుకుంటామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ అన్నారు. అకాల వర్షానికి నేలకొరిగిన వరి పంటలను కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. నాయకుడు కాంతయ్య తదితరులు ఉన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

వీర్నపల్లి మండలంలోని పలు గ్రామాల్లో వడగళ్ల వర్షానికి వరిపంట నేలకొరిగి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు గునుగుల దేవేందర్‌రెడ్డి కోరారు. పంట నష్టపోయిన రైతుల వివరాలను పూర్తి స్థాయిలో సేకరించాలన్నారు. వడగళ్ల వానకు ధాన్యం రాలిపోవడంతో ఎక్కువ మొత్తంలో నష్టం వాటిల్లిందన్నారు. గ్రామాల్లో పంట నష్టాన్ని అంచనా వేసేలా అధికారులను ఆదేశించాలని కోరారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలంలో వడగళ్ల వానతో నష్టపోయిన వరి పంటలను బీఆర్ఎస్ నేతలు ఆదివారం పరిశీలించారు. మలుపల్లె, గోరంటాల, రాజేశ్వర్‌రావు నగర్‌కాలనీ తదితర గ్రామాల్లో పంట నష్టాలను పరిశీలించారు. పరిశీలించిన జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, సెస్ డైరెక్టర్ నారాయణ రావు, ఎంపీటీసీ అంజిరెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, సురేందర్ తదితరులు ఉన్నారు.

● గంభీరావుపేట మండల కేంద్రంలో వడగళ్ల వానతో రష్టం పోయిన పంటలను ఆదివారం బీజేపీ నేతలు పరిశీలించారు. పరిశీలించిన వారిలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


రైతులతో మాట్లాడుతున్న బాల్‌రెడ్డి, వ్యవసాయాధికారులు


పంటను పరిశీలిస్తున్న నాయకులు

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షంతో వరి పంట దెబ్బతింది. మండల వ్యవసాయాధికారి వెంకటేశ్‌తో పాటు ఏఈవోలు గ్రామాల్లో పంట నష్టాన్ని అంచనా వేశారు. ముఖ్యంగా మోహ్రాయిపల్లె, నామాపూర్, చిప్పలపెల్లి గ్రామాల్లో దాదాపు 200 హెక్టార్ల వరి పంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేశారు.

అధైర్యపడొద్దు

వడగండ్ల వానతో రైతులు అధైర్యపడొద్దని ముస్తాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిప్పలపెల్లి, గోపాల్‌పల్లె, నామాపూర్ గ్రామాల్లో నష్టం వాటిల్లిన రైతులను పరామర్శించారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, నష్టపోయిన రైతులను ఆదుకునేలా అధికారులు ప్రాథమిక సర్వే చేస్తున్నారని అన్నారు. రైతులు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కరెడ్ల కొండల్‌రెడ్డి, కొండం రాజిరెడ్డి, కరుణాకర్, గుండెల్లి శ్రీనివాస్, గజ్జెల రాజు , రంజాని నరేశ్, శీలం స్వామి, తాళ్ల విజయ్‌రెడ్డి ఎదునూరి భాను, దశరథం, ఉచ్చిడి బాల్‌రెడ్డి చంద్రం, శ్రీను చందు, రాజయ్య దీపక్ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారిస్తాం

సిరిసిల్ల టౌన్, మార్చి 17 : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని త్వరలోనే నివారిస్తామని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును సిరిసిల్ల సీపీఐ నాయకులు కలసి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభ నివారణకు వెంటనే బకాయిలను విడదల చేయాలని, నూతన ఆర్డర్లు ఇవ్వాలని వినతి ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కూనమనేని తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంపై మంత్రుల బృందం సమీక్షించినట్లు చెప్పారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి ప్రధాన కారణం గత ప్రభుత్వాలు చేసిన తప్పిదాలేనని, కార్మికులను ఆదుకోవడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. మరోసారి ముఖ్యమంత్రితో సమావేశం అవుతామని, సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సీపీఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి గుంటి వేణు, లాల్ బాహుట చేనేత పవర్‌లూం కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పంతం రవి, నాయకులు అజ్జ వేణు, ఎనగందుల రాజు, పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తుదారుల సంఘం అధ్యక్షుడు మండల సత్యం, ప్రధాన కార్యదర్శి వెల్దండి దేవదాస్, గోవిందు రవి, బూట్ల నవీన్ పాల్గొన్నారు.


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

పంట నష్టాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాం


పంట నష్టాన్ని పరిశీలిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

గంభీరావుపేట, మార్చి 17 : వడగళ్ల వానతో జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని, రైతులు అధైర్య పడొద్దని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. గంభీరావుపేట మండల కేంద్రానికి సమీపంలో వడగళ్ల వానతో నష్టపోయిన వరి పంటను ఆదివారం పరిశీలించారు. మండల కేంద్రంతోపాటు మల్లారెడ్డిపేట, మల్లుపల్లె, గోరంటాల, నాగంపేట, దమ్మన్నపేట, పొన్నాలపల్లె, జిల్లల్లపల్లె తదితర గ్రామాల్లో వడగళ్ల వానకు పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. గ్రామాల వారీగా సంబంధిత వ్యవసాయ అధికారులు పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో అంచనా వేయాలని సూచించారు. గంభీరావుపేట మండలంతోపాటు వీర్నపల్లి, ముస్తాబాద్ మండలాల్లోనూ పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం కురిసిన వడగళ్ల వానతో పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. కొన్ని చోట్ల కోతకు వచ్చిన పంట, మరికొన్ని చోట్ల పొట్టదశలో ఉన్న వరి పంటకు నష్టం జరిగినట్టు అధికారుల ప్రాథమిక అంచనాల ద్వారా తెలుస్తోందన్నారు. గతంలో దివంగత రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అతివృష్టి, అనావృష్టితో నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకున్న చరిత్ర కాంగ్రెస్‌కు ఉందన్నారు. ఇప్పుడు కూడా కాంగ్రెస్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలో ఉందని, పంట నష్టానికి న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఇప్పటికే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సంబంధిత జిల్లా అధికారులతో మాట్లాడారన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, నాయకులు మల్యాల రాజవీర్, గంగి స్వామి, అంజిరెడ్డి, బాలరాంరెడ్డి, ఎర్ర నర్సయ్య, అక్కపల్లి బాలయ్య, ప్రభాకర్, ఎలుక రాజు, జంగం రాజులు, బోయన్నగారి లింగం, వ్యవసాయ అధికారులు ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న కురుమ సామాజిక వర్గం సభ్యులు

ముస్తాబాద్, మార్చి 17: ముస్తాబాద్ మండల కేంద్రంలోని కురుమ సామాజిక వర్గం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. యాదవ కుర్మ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డితోపాటు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లోనే కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు శీల ప్రశాంత్, కురుమ సంఘం అధ్యక్షుడు శీల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కంతుల భాస్కర్, జిగిరి కుమార్, కంతుల బాలయ్య, చంద్రం, దగ్గు రాజయ్య, గంగాల బాలయ్య, బండారి పెంటయ్య, కంతుల శ్రీనివాస్, కంతుల బాలయ్య, దేవయ్య, శీల మల్లేశ్, కంతుల రాజు తదితరులు పాల్గొన్నారు.

మోదీ పర్యటనను విజయవంతం చేయాలి

జగిత్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గీతా విద్యాలయం మైదానంలో నిర్వహించనున్న బీజేపీ విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కోరారు. ఆదివారం పట్ట ణంలో గీతా విద్యాలయం మైదానంలో జరుగుతున్న ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కార్యకర్తలు, నాయకులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న కుర్చీలు, బారికేడ్లు, వేదిక తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 18వ తేదీన పీఎం నరేంద్ర మోదీ హాజరు కానున్న భారీ బహిరంగ సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవం తం చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ నిర్వహిస్తున్న ప్రచార సభకు పీఎం మోదీ హాజరుకానున్నారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోగ శ్రావణిప్రవీణ్ పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజల గౌరవాన్ని కాపాడుతా

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


ఆది శ్రీనివాస్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

కోనరావుపేట, మార్చి 17 : వేములవాడ నియోజకవర్గ ప్రజల గౌరవాన్ని కాపాడేలా పనిచేస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం పల్లిముక్త గ్రామంలో ఆదివారం గోమాత పూజకు, మంగళపల్లెలో కృతజ్ఞత ర్యాలీకి హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గోమాత దయతో రైతులందరూ పాడి పంటలతో వర్ధిల్లాలన్నారు. ప్రజలందరికీ ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలిచానని, గెలుపులో భాగమైన ప్రతీ ఒక్కరిని కాపాడుకుంటానని అన్నారు. మండలంలోని లింక్ రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. గెలిచిన రెండు నెలల్లో ఆరు గ్యారంటీల్లో ఐదు విజయవంతంగా పూర్తి చేస్తున్నామన్నారు. మరొక పథకం త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్‌ను 200 యూనిట్ల వరకు అందిస్తున్నామన్నారు. గతంలో రూ.500కు సిలిండర్ ఉండేదని బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.1100 పెంచారన్నారు. మళ్లీ ఇప్పుడు రూ.500కు సిలిండర్ అందిస్తున్నట్లు చెప్పారు. మొన్నటి రోజున కేటీఆర్, హరీష్ రావు కాంగ్రెస్ వచ్చింది కరువు వచ్చిందని మాట్లాడుతున్నారని, వాళ్లు కరువు రావాలని కోరుకుంటున్నారా? ప్రజలు బాగుండాలని కోరుకుంటున్నారా? అని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉండి తమకు సహకరించి ప్రజలందరు బాగుండేలా చూసే ప్రయత్నం చేయాలి తప్ప ప్రజలను మోసం చేసే పనులు చేయొద్దన్నారు. ఎన్నికల ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన మేడిగడ్డ బ్యారేజ్ నెర్రలు బారి కుంగిపోయిందన్నారు. అది ఎలాగో కూలిపోతుందని కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు రాత్రికి రాత్రే 10 టీఎంసీల నీటిని సముద్రంలోకి విడిచిపెట్టారని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాగు నీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, చేపూరి గంగాధర్, ఫిరోజ్ పాషా, కచ్చకాయల ఎల్లయ్య బాల్ రెడ్డి, బుర్ర రవీందర్, ఉప్పుల గంగయ్య, పల్లె మంజుల రవీందర్ రెడ్డి, నాయని ప్రభాకర్ రెడ్డి, బాధనేని బాలరాజు, అవురం సురేష్, సాసాల రాజిరెడ్డి, ప్రభాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏనుగు మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

వేములవాడ టౌన్, మార్చి 17: వేములవాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం అభిమానులు, బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం రాజన్న ఆలయం ఎదుట కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కౌన్సిలర్‌లు నరాల శేఖర్, మారం కుమార్, నీలం కళ్యాణిశేఖర్, కుమ్మరి శ్రీనివాస్, శీలం విజయ్‌యాదవ్, కూరగాయాల శేఖర్, వంగల శ్రీకాంత్ పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు కోడగంటి శ్యామ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. విశాల్, ఉప్పులూటి మహేష్, సుమన్, శ్రీనివాస్, మహేందర్, సతీష్ పాల్గొన్నారు.

చందాలతో నిరుపేద మహిళకు అంత్యక్రియలు

తంగళ్ళపల్లి, మార్చి 17 : తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లికి చెందిన ఎర్రవెల్లి విజయ క్యాన్సర్‌తో ఆదివారం మృతి చెందగా గ్రామస్థులు చందాలు వేసుకొని అంత్యక్రియలు నిర్వహించారు. విజయ తన భర్త ముగ్గురు కూతుళ్లు వర్షిని (14), ఇందుశ్రీ (12), అక్షర (10)తో గ్రామంలోని రేకుల షెడ్డులో ఉంటున్నారు. ఆమె భర్త లింగారెడ్డి కూలీ చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. విజయ క్యాన్సర్ బారిన పడి మృతిచెందింది. పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న లింగారెడ్డిది తన భార్య విజయ దహన సంస్కారాలకు డబ్బులు లేని పరిస్థితి. దీంతో చలించిన గ్రామస్థులు చందాలు పోగు చేసి అంత్యక్రియలు నిర్వహించారు. బాధిత కుటుంబానికి ఎవరైనా దాతలు ఆర్థిక సహాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చంపుతానని బెదిరించిన వ్యక్తి రిమాండ్

వేములవాడ టౌన్, మార్చి 17 : భూమి రిజిస్ట్రేషన్ చేయకుండా చంపుతానని బెదిరించిన సిరిసిల్ల పట్టణానికి చెందిన రెడ్డవేణి గోపిని రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి ఆదివారం తెలిపారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన వోతకారి సాయిలుకు గోపి వేములవాడ మండలం సంకెపల్లిలో 43 గుంటల భూమిని విక్రయించాడు. మొత్తం డబ్బులు తీసుకున్న గోపి 23 గుంటలన్నర భూమిని మాత్రమే సాయిలుకు రిజిస్ట్రేషన్ చేశాడు. మిగిలిన 19 గుంటలన్నర భూమిని రిజిస్ట్రేషన్ చేయకుండా దాటవేస్తూ ఇబ్బందులకు గురిచేశాడని, చంపుతానని బెదిరించాడని సాయిలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ మేరకు గోపిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

రజాకార్ సినిమా వీక్షించిన బీజేపీ నాయకులు

వేములవాడ టౌన్, మార్చి 17 : బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఆదివారం రజాకర్ సినిమా మ్యాట్నీ ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వేములవాడ పట్టణ, మండల బీజేపీ నాయకులు రాజరాజేశ్వర థియేటర్‌లో సినిమాను వీక్షించారు. తెలంగాణ వీర పోరాటయోధుల త్యాగాలను నేటి తరానికి తెలియజెప్పే విధంగా రజాకర్ సినిమాను తీర్చిదిద్దినట్లు చెప్పారు. నాయకులు కుమ్మరి శంకర్, ఎర్రం మహేష్, రేగుల సంతోష్‌బాబు, అల్లాడి రమేష్ జక్కుల తిరుపతి, కోల కృష్ణస్వామి, జింక అనిల్, ఎర్రం మధు, గడప కిషోర్‌రావు, అక్కనపెల్లి వివేక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

జగిత్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని గొల్లపల్లి మండలం రాఘవపట్నంకు చెందిన సంఘ శ్రీనివాస్ (35) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. ఉపాధి నిమిత్తం దుబాయికి వెళ్లిన శ్రీనివాస్ ఇటీవల తిరిగి స్వగ్రామానికి వచ్చాడు. వివాహ విషయంలో ఆలస్యం చోటుచేసుకుంటుండడంతో మనస్తాపానికి గురై ఈనెల 16న ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన ఇరుగు పొరుగు, కుటుంబ సభ్యులు శ్రీనివాస్‌ను ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడు శ్రీనివాస్ తల్లి రాధ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సతీష్ తెలిపారు.

స్తంభాన్ని ఢీకొని కారు బోల్తా

వెల్గటూర్, మార్చి 17: వెల్గటూర్ పెద్దవాగు బ్రిడ్జి సమీపంలో శనివారం అర్ధరాత్రి సమయంలో ఓ కారు అదుపుతప్పి స్తంభా న్ని ఢీకొట్టింది. ఈ క్రమంలో కారు బోల్తా కొట్టి ముందు భాగం నుజ్జయింది. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం ఐదుగు రు వ్యక్తులు కారులో ధర్మపురికి దైవ దర్శనం నిమిత్తం హైద రా బాద్ నుంచి వస్తున్నారు. పెద్ద వాగు సమీపంలో అదుపు తప్పి సమీపంలోని స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఎవరికీ ప్రాణ నష్టం సంభవించకపోవడం తో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.